క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ

రామడుగు: ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం 10న నిర్వహించే హలో ముదిరాజ్ చలో కరీంనగర్ పోస్టర్‌ను మండల కేంద్రంలో గురువారం తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కునచ్చుల మహేందర్ ముదిరాజ్ ఆవిష్కరించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుండి బీసీ–ఏకు మార్చాలని, మత్స్యకారులకు అనుగుణంగా చట్టాలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. మండలం నుంచి సభకు ముదిరాజ్‌లు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా వైస్ చైర్మన్ పెసరు కుమారస్వామి, తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర సంపత్, రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పురం రాజేశం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మామిడి తిరుపతి, నాయకులు మల్లేశ్, సంపత్, రవి, కిషన్, అంజిబాబు, రాజు, అజయ్, దిలీప్ పాల్గొన్నారు.

రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గన్నేరువరం: వ్యవసాయశాఖ, కేంద్రీయ సస్య రక్షణ కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పారువెల్ల గ్రామంలో అధికారులు రైతులకు లింగాకర్షక బుట్టలు అందజేశారు. అనంతరం ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో పత్తి పంటపై రైతు క్షేత్ర పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ పద్ధతులు వివరించి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మిత్ర, శత్రు పురుగుల గూర్చి వివరించి, రసాయన మందులు వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మార్గదర్శనం చేశారు. లింగాకర్షక బుట్టలు, పీబీ రోప్ పద్ధతులను వివరించారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రైతులందరూ పాటించాలని కోరారు. కార్యక్రమంలో ప్లాంట్ ప్రొటెక్షన్ అసిస్టెంట్ అధికారులు ఉదయ్ శంకర్, బసవన్నెప్ప, ఏవో కిరణ్మయి, ఏఈవో అనూష పాల్గొన్నారు.

అవగాహన


అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు, నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని కార్తికేయ ఐటీఐ కళాశాలలో గురువారం చైర్మన్ లెంకలపల్లి శరత్ అధ్యక్షతన, సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవ, నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్, ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నరహరి, సభ్యులు వెంకటేశ్వర్లు, యాంసాని సందీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ క్లబ్ ప్రారంభం


క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి: మండలంలోని రాగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ క్లబ్‌ను హెచ్ఎం బి.దినకర్ గురువారం ప్రారంభించారు. విద్యార్థులు భాషా నైపుణ్యం పెంచుకోవాలని, క్లబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ టీచర్ గంగాధర నర్సయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని కోరారు.

దుస్తులు పంపిణీ



శంకరపట్నం: మండలంలోని వెంకటేశ్వర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పర్యావరణ కమిటీ అందించిన వైట్ డ్రెస్‌లను టీచర్లు గురువారం విద్యార్థులకు పంపిణీ చేశారు. శుక్రవారం సెలవు దినం కావడంతో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించామని హెచ్ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు.

నిత్యావసర సరుకులు..

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో గురువారం గామ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్టు ఇంచార్జి జోగు పొలు, పాత్తూరి సురేశ్ మాట్లాడుతూ... తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారికి అన్ని విధాలా భరోసా ఇవ్వడానికి ట్రస్టు కృషి చేస్తుందన్నారు.

పొలాన్ని కమ్మేసిన ఇసుక మేట



గన్నేరువరం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదలతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. గుండ్లపల్లి, జంగపల్లి చెరువులు ఉప్పొంగడంతో సమీప వరి పొలాలకు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పారువెల్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో పత్తి పంటలో నీరు నిలిచిందని వాపోతున్నారు.


చొప్పదండి: మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న టీచర్లు

టీచర్లకు ఘన సన్మానం

చొప్పదండి: రుక్మాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నిమ్మల సుధాకర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం విద్యాసాగర్‌రావు ఆధ్వర్యంలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చొప్పదండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలోని పద్దెనిమిది మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు పదోన్నతి లభించగా గురువారం హెచ్ఎం వైద్యుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కర్ర శ్రీధర్‌రెడ్డి, ఉప్పు జలపతిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇప్పనపల్లి సాంబయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మానకొండూర్: మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి అభిమానం చాటుకున్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని కొనియాడారు. ప్రిన్సిపల్ గోలి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గన్నేరువరంలో...


మానకొండూర్: ప్రిన్సిపల్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

గన్నేరువరం: గన్నేరువరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన గన్నేరువరం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రామయ్య, అలాగే ఖాసీంపేట ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. తెలంగాణ రైతుమిత్ర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లెల జగన్మోహన్, పుల్లెల రాము, జీల కుమార్‌యాదవ్, ఎల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జీల ఎల్లయ్య, జిల్లా క్యాబినెట్ మెంబర్లు గంప వెంకన్న, బూర శ్రీనివాస్, కోశాధికారి తేల్ల భాస్కర్ పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: రైతులు యూరియా కోసం ఆందోళనకు గురికావొద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. కురిక్యాల సహకార సంఘం వద్ద గురువారం యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతుల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సహకార సంఘం వద్ద పడిగాపులు కాస్తున్నామని, సాగుకు సరిపడా ఎరువును సరఫరా చేయాలని కోరారు. సరిపడా యూరియా సరఫరా చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా పంపిణీ చేయాలని సూచించారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

నానో యూరియాతో అధిక లాభాలు

హుజూరాబాద్: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో నానో యూరియా వాడకంపై ఏఈవో పొద్దుటూరి సతీశ్ గురువారం రైతులకు అవగాహన కల్పించారు. ద్రవరూపంలోని నానో యూరియా చాలా తక్కువ మోతాదులో వాడినా కూడా మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తుందన్నారు. నానో యూరియాతో అధిక లాభాలున్నాయని, తక్కువ మొత్తంలో యూరియా వాడటం వల్ల భూగర్భ జలాల్లోకి నత్రజని చేరడం తగ్గుతుందని, పర్యావరణ కాలుష్యాన్ని నివారిస్తుందన్నారు. నానో యూరియా రవాణా, నిల్వ ఖర్చు తక్కువ, రైతులకు డబ్బు ఆదా అవుతుందన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో

ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధించాలి

జమ్మికుంట: విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీల్లో సీటు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బి. బీరయ్య అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డా.రమేశ్ అధ్యక్షతన జామ్(జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. సాంకేతిక విద్యలో ప్రిపరేషన్‌తో జామ్ ద్వారా పీజీ సీట్లు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, అధ్యాపకులు రాజేంద్రం, గణేశ్, శ్యామల, మాధవి, రాజకుమార్, ఉమాకిరణ్, రవి, ఎల్ రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, సుష్మ, శ్రీనివాస్, మమత, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

కళాశాలలో ప్రిన్సిపల్ బి.రమేశ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థి ప్రముఖ వ్యాపార వేత్త బచ్చు భాస్కర్ సహకారంతో రెండో సంవత్సరం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ వర్చువల్‌గా గురువారం ప్రారంభించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ బీరయ్య

వైద్యశిబిరం

జమ్మికుంట: పట్టణంలోని బాలుర సంక్షేమ వసతి గృహంలో వావిలాల పీహెచ్‌సీ డాక్టర్ చందన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్, ఏఎన్ఎం రాధ, స్వప్న, సరిత పాల్గొన్నారు.


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చందన

సమన్వయంతో పనిచేయాలి



చొప్పదండి: వినాయక నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కోరారు. పట్టణంలోని నవోదయ విద్యాలయం ఎదుట ఎస్సారెస్పీ కాలువలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఆరోగ్య శాఖల అధికారులు కలిసికట్టుగా నిమజ్జనోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సీఐ ప్రదీప్‌కుమార్, ఎస్ఐ నరేశ్‌రెడ్డి, హెల్త్ అధికారి శ్రీదేవి, తదితరులున్నారు.

బీసీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీలు


కొండాపూర్‌లో అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్, ఉల్లంపల్లి గ్రామాల్లో గురువారం బీసీ సంక్షేమ సంఘం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కొండాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బింగి రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తాల్లపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా తౌటు నరేశ్, ఉపాధ్యక్షుడిగా పిల్లి రమేశ్, పోతరవేని శ్రీనివాస్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఉల్లంపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సుదగోని రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీమూర్తి తిరుపతితో పాటు పలువురిని ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్ష, కార్యదర్శులను గ్రామాల్లో ఎన్నుకున్నారు. కార్యక్రమాల్లో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, సింగిల్‌విండో డైరెక్టర్ తాల్లపల్లి తిరుపతి, జిల్లా నాయకులు చెల్పూరి విష్ణుమాచారి, కొత్తపల్లి సత్యనారాయణ, మార్క రాజ్‌కుమార్, మండల నాయకులు గుడిసె మల్లికార్జున్, మూల శ్రీనివాస్, పచ్చిమట్ల అజయ్, సిరవేణి సంపత్, చీకుట్ల సదితదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లి గ్రామంలో రెండు కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లను కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, హైమాస్ట్ లైట్లు మంజూరు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఓరుగంటి రవీందర్‌రావు, ఉపాధ్యక్షుడు బోలవేనా శంకర్, నాయకులు గుర్రపు సంపత్‌రెడ్డి, ఉమ్మడి రవీంద్రచారి గ్రామస్తులు పాల్గొన్నారు.

అరుదైన నరాల వ్యాధులకు వైద్య చికిత్స


ఆపరేషన్ చేసిన రోగితో వైద్యులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో అరుదైన నరాల వ్యాధులకు వైద్యచికిత్సలు అందిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ వి. సూర్యనారాయణరెడ్డి, నరాల వ్యాధుల విభాగం అధిపతి డాక్టర్ సంజయ్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అన్ని రకాల ఆధునిక వైద్య పరికరాలతో శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా నరాలకు సంబంధించి డీఎస్ఏ, త్రాంబోలైసిస్, త్రాంబెక్టమీ వైద్యపరీక్షలను తక్కువ ఖర్చుతో రోగులకు అందిస్తున్నామన్నారు. నరాల విభాగం అధిపతి డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లా ఓదెలకు చెందిన పిట్టల శ్రీధర్ పక్షవాతం లక్షణాలతో ఆస్పత్రిలో చేరగా ఉత్తర తెలంగాణలోనే మొదటిసారిగా డిజిటల్ సబ్‌స్ట్రాక్షన్ అంజియోగ్రఫీ(డీఎస్ఏ) చేసి స్టంట్ వేసినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన గుంటి దేవేందర్, మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన నక్క సత్యనారాయణలు పక్షవాతంతో నాలుగు గంటల్లోపు ఆస్పత్రికి రాగా వైద్య పరీక్షలను చేసి రక్తం గడ్డను కరిగించే ఇంజక్షన్ వేయడంతో కాలు, చేతులు పనిచేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో రూ. 5 లక్షల నుంచి రూ. 8 లక్షలవరకు ఖర్చయ్యే ఈ వైద్యసేవలను చల్మెడ ఆస్పత్రిలో రూ.1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు అందిస్తున్నట్లు తెలిపారు. పక్షవాతం రాకుండా నివారించే ఆధునిక వైద్యసేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆస్పత్రి సూపరిండెంటెంట్ రామకృష్ణ, మెడికల్ కళాశాల ప్రిన్స్‌పల్ అసీం అలీ, ఏవో శ్రావణ్,నరాల విభాగం వైద్యులు కె. వెంకటేశ్, హరిత, దివ్య, రవళి, శివ, ప్రఫుల్, మయాంక్ పాల్గొన్నారు.



మానకొండూర్: మానకొండూర్ మండల కేంద్రం వద్ద ఎస్సారెస్పీ డీబీఎం 3 ఉప కాలువపై నిర్మించిన కల్వర్టు ఇటీవల కూలిపోయింది. కాలువలో నీటి ఉధృతి పెరగడంతో కల్వర్టు కూలిపోయిందని, కాలువ కోతకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అస్మా, ఏఈ, డీబీఎం 3 , సెల్ నంబర్ : 99086 56063

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

గణనాథునికి ప్రత్యేక పూజలు


తిమ్మాపూర్: నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ కార్యాలయం సమీపంలోని శ్రీహోమ్స్ టౌన్‌షిప్‌లో గణనాథునికి తొమ్మిదో రోజు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణతోపాటు వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు.

జమ్మికుంట: వినాయక ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద గురువారం భక్తులు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. వాసవీనగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షమల్లెల అర్చన, అన్నపూజ కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల వద్ద అన్నదానం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.


జమ్మికుంట: పుష్పార్చనలో భక్తులు

బీజేపీ నాయకుల సంబరాలు

జమ్మికుంట: బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో దక్షిణ్, రాయపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపడంపై పీఎం మోదీ, కేంద్ర మంత్రులు అశ్వినివైష్ణవ్, బండి సంజయ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కొంతకాలంగా జమ్మికుంటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని జమ్మికుంట ప్రజల అవసరాలు, సౌకర్యం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రత్యేక చొరవతో రైళ్ల నిలుపుదలకు కృషి చేశారని, రైల్వేశాఖ నుంచి రెండు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని, రైళ్ల నిలుపుదలకు సహకరించిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, శీలం శ్రీనివాస్, రమణారెడ్డి, రావుల కుమార్, రామిడి అదిరెడ్డి,గోట్టిముక్కల సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న కృష్ణారెడ్డి, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం సమీపంలో గురువారం డోజర్ ట్రాక్టర్– కారు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. హన్మకొండ జిల్లా గోపాలపురంకు చెందిన తీగల రాజేందర్,శ్రీనివాస్ కారులో కరీంనగర్ నుంచి హన్మకొండకు వెళ్తుండగా హుజూరాబాద్ మండలం సింగాపూర్‌కు చెందిన డోజర్ ట్రాక్టర్ కేశవపట్నం వెళ్తుండగా మత్స్యగిరీంద్రస్వామి ఆలయం సమీపంలోని టోల్‌గేట్ వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. మద్యం మత్తులో కారు నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. కేశవపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 సమాచారం అందించారు. కారులోని వ్యక్తి మద్యం బాటిల్‌తో ఆస్పత్రికి వెళ్లడం చర్చనీయాంశమైంది.

ఇసుక లారీల పట్టివేత

గన్నేరువరం: అనుమతి లేకుండా కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు ఇసుక తరలిస్తున్న రెండు లారీలను గురువారం గుండ్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నామని ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. దుడ్డెల మహేందర్, ఎరుకుల అంజయ్యను విచారించగా ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో లారీని గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హాస్టల్ బియ్యం దుర్వినియోగం

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల గ్రామంలో గణేశ్ మండపం వద్ద అన్నదానం కోసం ఓ కాంగ్రెస్ నేత ప్రభుత్వ హాస్టల్ బియ్యాన్ని ఉపయోగించిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. విషయాన్ని గమనించిన ఓ గ్రామస్తుడు దానికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. ఘటనపై స్థానిక ఎమ్మెల్యే సదరు కాంగ్రెస్ నేతను మందలించాడని, అయినప్పటికీ, తీరు మార్చుకోని ఆ నేత ఫొటోలు పోస్ట్ చేసిన గ్రామస్తుడిపై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు పోస్టులు పెట్టాడంటూ ఫిర్యాదు చేశాడు. అంతేకాక పోస్ట్ చేసింది తప్పని ఒప్పుకొని మరో పోస్ట్ పెట్టాలంటూ గ్రామస్తుడిని బెదిరించినట్టు తెలుస్తోంది. హాస్టల్ బియ్యాన్ని దుర్వినియోగం చేయడమే కాక ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహరిస్తున్న నేతపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుడు డిమాండ్ చేశాడు. తప్పును ప్రశ్నించినందుకు తనపై ఫిర్యాదు చేయడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశాడు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో ప్రతిరోజు తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు.